క్లుప్తంగా

బీజేపీ వడ్డెర సెల్ జిల్లా కన్వీనర్ నియామకం

దుబ్బాక: బీజేపీ ఓబీసీ మోర్చా వడ్డెర కార్మిక సంఘం జిల్లా కన్వీనర్‌గా దుబ్బాక మండలం బల్వంతాపూర్‌కు చెందిన సంపంగి అశోక్‌ను నియమిస్తూ గురువారం బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సతీష్ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ జిల్లాలో వడ్డెర కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, రాష్ట్ర నాయకుడు బాలేష్‌గౌడ్, జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సతీష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11 కేవీ కోటిలింగాల ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లను తాకుతున్న చెట్ల కొమ్మల తొలగించనున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సిద్దిపేట పట్టణ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ, బాలాజీ నగర్, ఇందిరానగర్, ఎన్జీవోస్ కాలనీ, శ్రీ ఉమాపార్థీవకోటిలింగాల ఆలయం, రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణ, పోచమ్మ కాలనీ, శ్రీరాంనగర్, సుభాష్‌నగర్, మారుతీ నగర్ ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఎమ్ఆర్సీ తెరిసింద్రు..

సాక్షి ఎఫెక్ట్..

మర్కూక్(గజ్వేల్): రెండు సంవత్సరాల తర్వాత మండల వనరుల కేంద్రానికి మోక్షం లభించింది. గురువారం సాక్షిలో లక్షలు వెచ్చించి..లక్షణంగా వదిలేసి అనే కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. గురువారం ఉదయం మండల విద్యాధికారి ఉదయ్‌భాస్కర్‌రెడ్డి కార్యాలయానికి వచ్చి తాళం తీశారు. గదులను పరిశీలించి కార్యాలయాన్ని సిబ్బందితో శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే సామగ్రితో పాటు కంప్యూటర్ ఆపరేటర్, స్వీపర్‌ను నియమిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల సమావేశాలు ఈ భవనంలోనే నిర్వహిస్తామని చెప్పారు. ఎంఐఎస్ శ్రీధర్, సీసీఓ హరిబాబు, సీఆర్పీ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, మరుగుదొడ్లు, హార్టి కల్చర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేనివారి జాబితా పంపించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

చికిత్స పొందుతూ ఎలక్ట్రీషియన్ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడిన ఎలక్ట్రీషియన్ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణానికి చెందిన ఎలక్ట్రీషియన్ బోనగిరి యాదగిరి(50) మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న భవనంలో ఎలక్ట్రికల్ పనులు చేస్తున్నాడు. పని చేస్తున్న క్రమంలో జూన్ 21వ తేదీన భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెంటనే తోటి కార్మికులు యాదగిరిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

ముగ్గురిపై కేసు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో వ్యవసాయ భూమిలో పొలం పనులను అడ్డుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గుర్రం ప్రమోద్ రెడ్డికి రాంచంద్రాపూర్ గ్రామంలో 6.36 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని సాగు చేయడానికి బుధవారం ట్రాక్టర్‌తో దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నోముల పద్మతోపాటు భర్త కొండాల్‌రెడ్డి, కుమారుడు వికాస్‌రెడ్డి అడ్డుకొని దాడి చేశారు. ప్రమోద్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేత

సిద్దిపేటకమాన్: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి, నిరుద్యోగులపై జరిగిన దాడికి నిరసనగా బీఆర్ఎస్‌వీ నాయకులు జిల్లా కేంద్రం సిద్దిపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. యూనివర్సిటీలోకి పోలీసులు వెళ్లి విద్యార్థులను కొట్టడం సరికాదన్నారు. నిరుద్యోగులపై జరుగుతున్న అణిచివేత ధోరణి మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రజనికాంత్‌రెడ్డి, బాబు, మహేష్ పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ అందరి బాధ్యత

మద్దూరు(హుస్నాబాద్): అధిక జనాభాతో కలిగే నష్టాలపై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ స్టువర్ట్ స్టన్ అన్నారు. ప్రపంచ జనాభా దినం పురస్కరించుకొని గురువారం లద్నూరు గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మగ, ఆడ పిల్లలని సమానంగా చదివించి అన్ని రకాలుగా వారికి చేయూత అందించాలన్నారు.

బక్రిచెప్యాలలో..

సిద్దిపేటఅర్బన్: మండల పరిధిలోని బక్రిచెప్యాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గ్రామంలో ర్యాలీ తీశారు. ర్యాలీలో బాలికల చదువు ప్రాముఖ్యత, బాల్యవివాహాల నిషేధ ప్రాధాన్యం, భ్రూణ హత్యల నివారణ, మహిళా సాధికారత, సమానత్వం, వృద్ధుల పట్ల బాధ్యత కలిగి ఉండాలని నినాదాలు చేశారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు పూర్ణచందర్‌రావు విద్యార్థులకు జనాభా పెరుగుదలపై పోస్టర్ తయారీ, ఉపన్యాస, వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, సుహాసిని, శ్రీశైలం, రాజేందర్, లక్ష్మయ్య, సునీత, ఆగయ్య తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో వరల్డ్ పాపులేషన్ డే ర్యాలీ

న్యాయవాదిపై దాడి హేయమైన చర్య


దుబ్బాకలో నినాదాలు చేస్తున్న న్యాయవాదులు

● దుబ్బాక న్యాయవాదులు

దుబ్బాక: న్యాయవాదిపై అకారణంగా దాడిచేసిన సిద్దిపేట టూ టౌన్ ఏఎస్ఐ ఉమారెడ్డి, అతడికి సహకరించిన సీఐ ఉపేందర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం దుబ్బాక న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. చట్టాన్ని గౌరవించాల్సిన పోలీసులే న్యాయవాదిపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. హైకోర్టు ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న ఏఎస్ఐ, సీఐలను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదిపై దాడికి నిరసనగా రెండు రోజుల పాటు విధులను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో దుబ్బాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురావు, గౌరవ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీహెచ్ నాగరాజు, భాస్కర్‌రెడ్డి, అశోక్, భిక్షపతి, సంతోష్‌కుమార్, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రభు, మహేష్, యుగంధర్ తదితరులు ఉన్నారు.

ప్రత్యేక చట్టం తేవాలి

హుస్నాబాద్: సిద్దిపేటలో న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని ఖండిస్తూ గురువారం హుస్నాబాద్ కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్ మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తేవాలన్నారు. న్యాయవాదులకే రక్షణ కరువైతే సాధారణ ప్రజలకు ఎక్కడ రక్షణ ఉంటుందని ప్రశ్నించారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన పోలీస్ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, చిత్తారి హన్మయ్య, కన్నోజు రామకృష్ణ, ప్రవీణ్, సంపత్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలంలో రైతులు సాగు చేస్తున్న పంట వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏఓ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని వల్లంపట్ల గ్రామంలో పంట వివరాలను నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల వివరాలు నమోదు చేసుకుంటే ప్రభుత్వ మద్దతు ధర పొందేందుకు వీలుపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అనూష పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న ప్రవీణ్ కుమార్

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్ గ్రామంలో చేపట్టిన హనుమాన్ ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ తిగుల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పల ప్రవీణ్ కుమార్ డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి సమక్షంలో రూ.50 వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగ్రామంలో నిర్మిస్తున్న ఆలయానికి తమ వంతు విరాళం ఇవ్వడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

నిబంధనలు తప్పనిసరి

సిద్దిపేటజోన్: మున్సిపల్ చట్టం ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి సూచించారు. గురువారం మున్సిపల్ చైర్మన్ మంజుల, వైస్ చైర్మన్ కనక రాజుతో కలిసి టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో టీఎస్ బీపాస్ ప్రకారం కొత్తగా ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తులు చేసుకోవాలని, దళారుల ప్రమేయం లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా అనుమతి ఇచ్చేలా ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు.

నిర్మలాజగ్గారెడ్డికి అభినందనలు


శుభాకాంక్షలు చెబుతున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: టీఎస్ఐఐసీ (తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన నిర్మలని సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అభినందించారు. గురువారం హైదరాబాద్‌లో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు వంటేరు నరేందర్‌రెడ్డి, సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష వాయిదా వేయాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 18వ తేదీన నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షను మూడు నెలల పాటు వాయిదా వేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పిడిశెట్టి రాజు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని వెంకటేశ్వరపల్లిలో ఆయన మాట్లాడుతూ టెట్ పరీక్ష నిర్వహించి నెల కాక ముందే డీఎస్సీ పరీక్ష నిర్వహించడం ఎంత వరకు సమంజసమన్నారు. సిలబస్ ఎక్కువ కారణంగా డీఎస్సీ పరీక్షకు సిద్ధం కావడానికి కనీసం 90 రోజులు సమయం ఇవ్వాలన్నారు. 2 లక్ష మంది డీఎస్సీ అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పరీక్షను వాయిదా వేయాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మంత్రికి వినతి

తొగుట(దుబ్బాక): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మర్యాద పూర్వకంగా గురువారం కలిసినట్లు టీపీసీసీ ఫిషర్‌మెన్ కార్యదర్శి రేపాక తిరుపతి తెలిపారు. దుబ్బాకలో నెలకొన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరినట్లు చెప్పారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతున్న తిరుపతి

ఎన్నికల హామీలను అమలు చేయాలి


గజ్వేల్‌లో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

● ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి

గజ్వేల్‌రూరల్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అభయహస్తం పేరిట ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గజ్వేల్‌లో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లను బీసీ (డి) నుంచి బీసీ (ఏ)లోకి చేర్చి రిజర్వేషన్ అమలు చేయాలని, జీవో 6 ప్రకారం చెరువులు, కుంటల్లో చేపలు పట్టుకునేందుకు పూర్తి హక్కులను కల్పించాలన్నారు.

మొక్కలు పెంచితే బహుమతులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల 5జీ టౌన్ షిప్ నిర్వాహకులు గురువారం గ్రామస్తులకు 200 మందికి మొక్కలను పంపిణీ చేశారు. మొక్కలు నాటిన వారు వీడియో తీసి టౌన్ షిప్ యాజమాన్యానికి పంపిస్తే డ్రా తీసి ఒకరికి రేంజర్ సైకిల్, మిగిలినవారికి స్టీల్ వాటర్ బాటిల్స్ అందజేస్తామన్నారు. మొక్కలు నాటితే గ్రామంలో వాతావరణ కాలుష్యం నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి

● మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: వాతావరణ కాలుష్య నివారణ, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత పిలుపు ఇచ్చారు. గురువారం పట్టణంలో 12, 14, 20వ వార్డుల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెట్లు లేకపోతే మానవ మనుగడ కష్టమవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు గూళ్ల రాజు, సరోజన, వాల సుప్రజ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

ఎన్ఆర్ఐ బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ సేవలు భేష్


సైకిల్స్ పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ గన్నె వనిత

● మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత

దుబ్బాక: పేద కుటుంబాల పిల్లల విద్యకు, సమజ అభివృద్ధికి ఎన్ఆర్ఐలు చేస్తున్న సేవలు అభినందనీయమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత అన్నారు. మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బల్వంతాపూర్, నర్లెంగడ్డ గ్రామాలకు చెందిన 30 మంది విద్యార్థినులకు ఎన్ఆర్ఐ బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ సౌజన్యంతో సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమెరికాలో స్థిరపడ్డ సిద్దిపేట వాస్తవ్యులు ఎన్ఆర్ఐ బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ పేరిట సేవా కార్యక్రమాలు చేపడుతుండటం అభినందనీయమన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ అధికం సుగుణ బాలకిషన్‌గౌడ్, కౌన్సిలర్ ఇల్లందుల శ్రీనివాస్, ఎంఈఓ ప్రభుదాసు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు కేటాయించాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఐవోసీ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓ ఆరీఫాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ మాట్లాడుతూ లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఇళ్లు కేటాయించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి నిరుపేదలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు నత్తి శివకుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విచారణ చేయాలి

సిద్దిపేటరూరల్: అభివృద్ధి పనుల్లో చిన్నకోడూరు మండల మాజీ ఎంపీపీ మాణిక్యరెడ్డి అవినీతికి పాల్పడ్డాడని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ కుంచం అశోక్, సురగోని శేఖర్ గురువారం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. మండల నిధులు, ఎంపీపీ నిధులు ఏఏ గ్రామాల్లో ఎంత ఖర్చు పెట్టారో తెలియడం లేదన్నారు. ఈ విషయంపై జెడ్పీసీఈఓను వివరాలు కోరినప్పటికీ రాజకీయ పలుకుబడితో విచారణకు అడ్డుకుంటున్నారన్నారు. అధికారులు విచారణ జరిపి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని కోరారు.

బల్దియాకు సహకరించాలి

సిద్దిపేటజోన్: సిద్దిపేటను శుద్ధిపేటగా మర్చేందుకు మాంసం విక్రయ వ్యాపారులు బల్దియాకు సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల పిలుపునిచ్చారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలోని మాంసం విక్రతలతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని రూ.5 కోట్లతో స్లాటర్ హౌస్ ఏర్పాటు చేశామని, దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి, అదనపు కమిషనర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

వర్షాల కోసం బతుకమ్మ ఆటలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): వాన దేవుడికి ఉయ్యాల్లో... ఏమి కోపం వచ్చే ఉయ్యాల్లో.. నెల దాటిపాయే ఉయ్యాల్లో..చినుకు రాలేదాయే ఉయ్యాల్లో..పగబట్టకయ్య ఉయ్యాల్లో..పంట పండించయ్య ఉయ్యాల్లో అంటూ మహిళలు గ్రామాల్లో వర్షాల కోసం బతుకమ్మ ఆటలు ఆడుతున్నారు. గురువారం మండలంలోని తిగుల్ గ్రామంలో మహిళలు వీధుల్లో, గ్రామ దేవతల ఆలయాల్లో నీళ్లు పోసి వర్షం కోసం పాటలు పడుతూ బతుకమ్మ ఆడారు. పంటలు పండాలని మొక్కుకున్నారు.


తిగుల్‌లో వర్షాల కోసం బతుకమ్మ ఆడుతున్న మహిళలు

భక్తిరత్న పురస్కార గ్రహీతకు సన్మానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపకుడు రామకోటి రామరాజుకు ఇటీవల భక్తిరత్న జాతీయ గౌరవ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం జగదేవ్‌పూర్ ఆర్యవైశ్య భక్త బృందం సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామకోటి రామరాజు మాట్లాడుతూ 25 ఏళ్లుగా చేస్తున్న ఆధ్యాత్మిక సేవలను గుర్తించి భక్తిరత్న పురస్కారం ప్రదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య భక్త బృందం సభ్యులు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ నేరం

హుస్నాబాద్: వాహనదారులు చలానాలను తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్‌ను ట్యాంపరింగ్ చేయవద్దని, అలా చేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై తోట మహేష్ హెచ్చరించారు. పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరం చేసిన వారు తమ వాహనాలను గుర్తించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. అలాగు మైనర్ డ్రైవింగ్ నేరమని, వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు.

దేవాలయ భూమి పరిశీలన

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని నాగపురి శివారు నల్లపోచమ్మ ఆలయ భూమి ఆక్రమణకు గురైందంటూ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రెవెన్యూ అధికారులు దేవాలయ భూమిని సందర్శించారు. అనంతరం ఆర్ఐ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. నల్లపోచమ్మ ఆలయ భూములు ఆక్రమణకు గురైనట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే చేయించామన్నారు. ఆయన వెంట ట్రస్ట్ బోర్డు చైర్మన్ మహేష్ పాల్గొన్నారు.

టీజీఐఐసీ చైర్మన్‌కు సన్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీజీఐఐసీ చైర్మన్‌గా నిర్మల ప్రమాణ స్వీకారం గురువారం హైదరాబాద్‌లో జరిగినట్లు సిద్దిపేట నాయకులు తెలిపారు. ఆమెను సన్మానించినట్లు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి మార్క సతీష్‌గౌడ్, అంజయ్య, భిక్షపతి, తప్పెట శంకర్, పిట్ల ఏసు, మల్లేశం, గయాసుద్దీన్, రషీద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధ్యాయులకు సన్మానం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రామునిపట్ల ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల బదిలీ అయ్యారు. గురువారం వారికి పాఠశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు ధర్మయ్య, వినోద్‌ను హెచ్ఎం నాగరాజు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు.

◆ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం

దుబ్బాకటౌన్: దౌల్తాబాద్ మండల కేంద్రంలో శ్రీపద్మావతి అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 32వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆర్యవైశ్య మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బ మాధవి, మండల అధ్యక్షుడు అశోక్ గుప్త ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష పుష్పార్చన, శతకలశాభిషేకం, ఊరేగింపు నిర్వహించారు.

◆ విద్యార్థులకు టై, బెల్ట్ అందజేత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పనిచేస్తున్న గ్రామస్తురాలు కోల శ్రీజ చేయూత అందించింది. గురువారం విద్యార్థులకు రూ.40 వేల విలువగల టై, బెల్ట్, ఐడికార్డ్స్, బూట్లు, సాక్స్ అందజేసింది.

◆ సమస్యలు పరిష్కారించాలని వినతి

కోహెడ(హుస్నాబాద్): ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు తక్షణమే కల్పించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చిట్యాల శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సమస్య, ప్రహరీ, కిటికీలు లేకపోవడం, కంప్యూటర్ ల్యాబ్, ఉపాధ్యాయుల కొరత తదితర సమస్యలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

◆ అక్రమ సిట్టింగ్‌లు నిర్వహిస్తే కఠిన చర్యలు

చేర్యాల(సిద్దిపేట): కొమురవెల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అక్రమ సిట్టింగ్‌లు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొమురవెల్లి ఎస్ఐ రాజుగౌడ్ హెచ్చరించారు. గురువారం తన సిబ్బందితో కలిసి మండల పరిధిలోని గుర్జకుంట క్రాస్ రోడ్డు సమీప దాబాల్లో తనిఖీలు నిర్వహించారు. అక్రమ సిట్టింగ్ నడుపుతున్న ముగ్గురు దాబా యజమానులపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

◆ ప్రతీ కార్యకర్తకు సముచిత న్యాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీలో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. జిల్లా కోర్టులో గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన జీవన్‌రెడ్డిని గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది ఆత్మారాములు, కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇసుక టిప్పర్ సీజ్

చిన్నకోడూరు(సిద్దిపేట): ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్‌చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేస్తుండగా, రామునిపట్ల నుంచి చిన్నకోడూరుకు ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన టిప్పర్ యాజమాని గొర్రె అంజయ్య, డ్రైవర్ పొద్దుల రాకేశ్‌పై కేసు నమోదు చేశారు.

◆ సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

మద్దూరు(హుస్నాబాద్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ రామ్మోహన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వనమహోత్సవం, సీజనల్ వ్యాధులు, మరుగుదొడ్లు, హార్టి కల్చర్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో మరుగుదొడ్లు లేనివారి జాబితా పంపించాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

◆ అక్రమ ఇసుక కాదు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి శివారులో నిల్వ చేసిన ఇసుకను ఇటీవల పోలీసులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. గురువారం రైతు రంగారెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పొలంతా ఇసుక మేటలు వేయడంతో, ఆ ఇసుకను ఒక చోట నిల్వ ఉంచానన్నారు. తాను లేని సమయంలో పోలీసులు వచ్చి ఇసుకను సీజ్ చేశామంటూ ప్రకటనలు చేశారన్నారు. పొలంలో ఇసుక మేటలు వేసిన వీడియోలు ఉన్నాయన్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులు తనకు న్యాయం చేయాలని కోరాడు.